క్లుప్తంగా

తుంగభద్ర పరవళ్లు



మోటారును తొలగించుకుంటున్న రైతన్నలు

కౌతాళం: తుంగభద్ర డ్యాం పరివాహక ప్రాంతంలో విస్తరంగా వర్షాలు కురుస్తుండడంతో తుంగభద్ర డ్యాం పూర్తిస్థాయిలో నిండిపోయింది. దీంతో అధికారులు తుంగభద్రనదికి 80వేల క్యూసెక్కులు నీరు వదిలారు. ఈ నీరు ఆదివారం ఉదయం ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన మేళిగనూరుకు చేరాయి. దీంతో తుంగభద్ర నది పరవళ్లు తొక్కుతోంది. మేళిగనూరుతో పాటు మరళి, గుడికంబాలి, వల్లూరు, కడదొడ్డి, కుంబళనూరు వద్ద నీరు పూర్తిస్థాయిలో రావడంతో రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లను, పైపులను తొలగించుకోవడం కనిపించింది.

నేడు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే రాక

దేవనకొండ: మండల కేంద్రంలో సోమవారం జరగబోయే పల్లె పండగ వారోత్సవాల్లో జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్యే విరూపాక్షి పాల్గొంటారని అధికార వర్గాలు ఆదివారం తెలిపాయి. అన్ని శాఖల అధికారులు వారోత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

17న అంతర్‌రాష్ట్ర ఓపెన్ కబడ్డీ పోటీలు

కృష్ణగిరి: మండలంలోని కోయిలకొండ గ్రామంలో వాల్మీకి జయంతి సందర్భంగా ఈ నెల 17వ తేదీన అంతర్‌రాష్ట్ర ఓపెన్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. గెలుపొందిన జట్లకు దాతల సహకారంతో వరుసగా రూ. 30వేలు, రూ. 20వేలు, రూ.10వేలు, రూ. 5 వేలు అందజేస్తామని చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 16న ఉదయం 9 గంటలలోపు రూ. 500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ 9493686207, 6300364569 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రైతులు సూచనలు పాటించాలి

ఆస్పరి: ఈనెల 16వ తేదీ వరకు వర్ష సూచన ఉందని వాతావరణ శాఖ తెలిపినందున రైతులు సూచనలు పాటించి పంటలను కాపాడుకోవాలని ఏఓ నరేంద్రకుమార్ ఆదివారం తెలిపారు. పొలాల్లో వర్షపు నీరు నిలవకుండా బయటకు పంపాలి. వీలైంత వరకు పైర్లలో పైపాటి ఎరువులు వేయరాదు. వర్షం నిలిచిన తరువాత పైపాటి ఎరువులు వేసుకోవచ్చు. వేరుశనగ పంట కోత పూర్తయి ఉంటే కాయలు తడవకుండా టార్పాలిన్‌తో కప్పుకోవాలి. కోతకు సిద్ధంగా ఉంటే వర్షం తగ్గిన తరువాత కోయాలి. పత్తి కోతలు చివరి దశలో ఉన్నందున చివరి కోతను వాయిదా వేసుకోవాలి. వీలైనంత వరకు పప్పు శనగ విత్తు వాయిదా వేసుకోవాలి. వర్షాలు తగ్గిన తరువాత విత్తుకుంటే మంచిది. కంది మొగ్గ నుంచి పూత దశలో ఉంది కావున వర్షాలు ఎక్కువై పొలాల్లో నీరు నిలిస్తే పొలం నుంచి నీటిని బయటకు పంపాలి. లేకపోతే కందికి వేరుకుళ్లు, ఎండు తెగులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు.

సేవలకు సన్మానం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణ ఆర్యవైశ్య సంఘంలో 25 ఏళ్లు సేవలు అందించి సంఘం బలోపేతానికి కృషి చేశారని వెల్దుర్తి ఆర్యవైశ్య సంఘం తాత్కాలిక అధ్యక్షుడు సముద్రాల శ్రీరాములు కొనియాడారు. ఆదివారం స్థానిక అమ్మవారిశాలలో జనరల్ సెక్రటరీ ఒంగోలు సాయిప్రసాద్‌ను సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. సముద్రాల వెంకటేశ్వర్లు, అత్తులూరి సుబ్రమణ్యం, సురేష్‌బాబు, కిరణ్, సుధాకర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాదయాత్ర భక్తులకు సన్మానం



అయోధ్యకు పాదయాత్రగా వెళ్తున్న భక్తులను సన్మానిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): బెంగళూరు నుంచి అయోధ్యకు పాదయాత్రగా వెళ్తున్న భక్తులను ఆదివారం వెల్దుర్తి వద్ద జాతీయ రహదారిలో ఏర్పాటు చేసిన అభయ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద సన్మానించారు. విగ్రహ వ్యవస్థాపకులు గురుస్వామి చిన్న రామాంజనేయులు, భక్త బృందం ఆధ్వర్యంలో పాదయాత్రగా వెళ్తున్న తులసీ కృష్ణ బృందాన్ని ఘనంగా సన్మానించారు. అయోధ్య రామయ్యను దర్శించుకోవాలనే కోరికతో పాదయాత్రగా వెళ్తున్నట్లు తులసీ కృష్ణ తెలిపారు.

'ప్రజా ఫిర్యాదుల వేదిక' రద్దు

ఆదోని రూరల్: ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదివారం తెలిపారు. సోమవారం నుంచి పల్లె పండగ వారోత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో అధికారులు అందుబాటులో ఉండరని, దీంతో ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు వెల్లడించారు. పల్లె పండగ వారోత్సవాలు పూర్తి అయిన తర్వాత యథావిధిగా కొనసాగుతుందన్నారు.




పూజలందుకుంటున్న మద్దమాంబ అమ్మవారు, రాజేశ్వరి అమ్మవారు






ఆస్పరి, జొహరాపురంలో పూజలందుకున్న గాయత్రీ మాత, కన్యకా పరమేశ్వరీ మాత, మారెమ్మవ్వ, పెద్దమ్మవ్వ



ఆలూరులో నిజరూప దర్శనంలో వాసవీదేవి

ఘనంగా దసరా ఉత్సవాలు

- శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు
- శమీ ఆకులు అందజేసి పెద్దల ఆశీర్వాదం తీసుకున్న యువత
- దుర్గా దేవి విగ్రహాలకు నిమజ్జనోత్సవం



ఆస్పరిలో మారెమ్మవ్వ ఆలయాన్ని పూలతో అలంకరించిన దృశ్యం



బన్ని ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు, కొండపై మాళమల్లేశ్వర స్వామి ఆలయం



మాళమల్లేశ్వరుని పూజల్లో పాల్గొన్న ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి

తుగ్గలి : దసరా శరన్నవరాత్రి ముగింపు ఉత్సవాలను తుగ్గలిలో వైభవంగా నిర్వహించారు. శనివారం విజయదశమి పండుగ రోజు దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సాయంత్రం అమ్మవారిని ట్రాక్టర్‌లో ఉంచి డీజే చప్పుళ్లు, మేళతాళాలు, నృత్యాల నడుమ భక్తులు శోభాయాత్రగా నిమజ్జనానికి తరలించారు.

పత్తికొండ(తుగ్గలి) : పట్టణంలో కన్యకాపరమేశ్వరీదేవీ ఆలయంలో ఆర్యవైశ్య సంఘం నాయకుల ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. విజయదశమి పండుగ రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో వాసవీమాత అమ్మవారు, వెంకటేశ్వరస్వామి, రామలింగేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ఉంచి మేళతాళాలతో ఊరేగించారు. ఆదివారం వసంతోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పెద్దలు డాక్టర్ సుబ్రహ్మణ్యం, నాయకులు ఈర్లదిన్నె రమేష్, రాధాకృష్ణ, లక్ష్మీనారాయణ, విశ్వనాథం, రాజనారాయణగుప్త, రమేష్‌బాబు, నాగరాజు, వీరన్నసెట్టి, చిట్టెం వీరేష్, డైరెక్టర్లు పాల్గొన్నారు. పత్తికొండ, తుగ్గలి మండలాల్లో ప్రజలు దసరా వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లలో తమ ఇష్టదైవాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయాల్లో వెళ్లి పూజలు చేశారు. సాయంత్రం సమీపంలో ఉన్న జమ్మి చెట్ల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. జమ్మి ఆకులను తీసుకుని పెద్దలు, బంధుమిత్రులకు అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు.

ఆస్పరి: మండలంలోని గ్రామాల్లో దసరా పండుగ సంబరాలు శని, ఆదివారం రెండు రోజులు పాటు ఘనంగా నిర్వహించారు. ఆస్పరిలోని జనార్ధన స్వామి, మారెమ్మ అవ్వ, రామతీర్థంలోని రామలింగేశ్వర స్వామి, గాయత్రీ మాత, పార్వతీదేవి, జొహరాపురంలో పెద్దమ్మవ్వ, మారెమ్మవ్వ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆస్పరిలో జనార్ధన స్వామి పల్లకీ సేవ, గ్రామ సమీపంలోని పక్కీరప్ప తాత ఆలయం వద్దనున్న జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయం ప్రకారం యువతీ, యువకులు జమ్మి పత్రిని పెద్దలకు అందజేసి ఆశీర్వాదం పొందారు.

వసంతోత్సవం..

ఆస్పరిలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి మాత ఆలయంలో ముగింపు వేడుకల సందర్భంగా వసంతోత్సవం నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు ఒకరిపై ఒకరు రంగులు వేసుకుని సంబరాలు జరుపుకున్నారు. అంతకుముందు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి గంగ పూజలు చేశారు.

ఆలూరు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో ఈనెల 2 నుంచి 12వ తేదీన విజయదశమి పండుగ వరకు పది రోజులు పాటు ఆలయ అర్చకులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. శనివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. అమ్మవారు నిజరూపంలో దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జనార్ధనసెట్టి, కార్యదర్శి గూడూరు శ్రీనాథ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి భాస్కర్, సుబ్బయ్య, చంద్రశేఖర్, నాగేంద్రయ్య పూజలు చేశారు.

మద్దికెర : స్థానిక మద్దమాంబ అమ్మవారికి శనివారం విజయదశమి పండుగ పురస్కరించుకొని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, మహామంగళహారతి, నైవైద్యం వంటి కార్యక్రమాలు చేపట్టారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజలు చేశారు.

జమ్మిచెట్టుకు పూజలు

పెరవలి గ్రామంలోని శ్రీరంగనాథస్వామి దేవాలయంలో శనివారం విజయదశమి పండుగను పురస్కరించుకొని అర్చకులు రంగస్వామి ఆధ్వర్యంలో భక్తులు భక్తి శ్రద్ధలతో జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామివారు, శ్రీదేవి, భూదేవిలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి ప్రదక్షిణలు చేశారు. అనంతరం శమీ పూజలు జరిపించారు. రాజ్యలక్ష్మి అమ్మవారిని రాజరాజేశ్వరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ వీరయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

హొళగుంద: మండలంలో శనివారం దసరా పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి, హొళగుందలోని శ్రీవీరభద్రేశ్వర, సిద్ధేశ్వర స్వామి తదితర ఆలయాలలో జలాభిషేక, మహా మంగళహారతి, నైవేద్య సమర్పణ తదితర పూజలు చేశారు. హొళగుందలో రాజవంశీకులు రాజ పంపన్నగౌడ్ నివాసంతో పాటు భక్తులు దసరా ఉత్సవంలో భాగంగా ఆయుధ పూజ చేశారు. సాయంత్రం బంగారు ఖడ్గంతో రాజ వారసుడిని అశ్వం పై కూర్చోబెట్టి పుర వీధుల గుండా గ్రామ శివారులోని శమీవృక్షం వరకు ఊరేగించారు.

అలరించిన కోలాటం

హాలహర్వి: దసరా, బన్ని ఉత్సవాల సందర్భంగా శనివారం మండలంలోని నిట్రవట్టి, బిలేహాల్, విరుపాపురం, బల్గోట గ్రామాల్లో కోలాటలు జరిగాయి. ఏటా సంప్రదాయబద్ధంగా కోలాటలు నిర్వహిస్తామని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. కోలాటలను తిలకించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

దేవనకొండ: మండలంలోని దేవనకొండ, కప్పట్రాళ్ల, కరివేముల, తెర్నెకల్, పి.కోటకొండ తదితర అన్ని గ్రామాల్లో శనివారం దసరా పండగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం ఆయా ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు, స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవనకొండలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామిని పల్లకోత్సవం చేపట్టారు.

మాళమల్లేశ్వరుని పూజల్లో పాల్గొన్న ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి

ఆలూరు/హొళగుంద: దేవరగట్టు శ్రీమాళ మల్లేశ్వరస్వామిని ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి శనివారం దర్శించుకుని పూజలు చేశారు. తనయుడు చంద్రశేఖర్, సోదరుడు శ్రీరాములు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వచ్చిన ఆయనకు ఆలయ పూజారులు స్వాగతం పలికి సాదరంగా ఆహ్వానించారు. కుంకుమార్చన, అభిషేకాలు ఇతర ప్రత్యేక పూజలు నిర్వహించిన పూజారులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే కల్యాణోత్సవానికి ఉంచిన ఉత్సవమూర్తులను ఎమ్మెల్యే దర్శించుకున్నారు.

కృష్ణగిరి: దసరా పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాలో అమ్మవార్లకు, జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించారు. పిల్లలు జమ్మి ఆకులు అందించి పెద్దల ఆశీర్వాదం పొందారు. శనివారం దసరా ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అమ్మవార్లను గ్రామ వీధుల్లో ఊరేగించారు. వెల్దుర్తిలోని అమ్మవారిశాలలో వెలసిన కన్యకాపరమేశ్వరి రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

ఊరు చివరన ఉన్న జమ్మి చెట్టు వద్ద పురోహితుల సమక్షంలో పంచాంగం నిర్వహించారు. గ్రామంలో ఆర్యవైశ్యులు దుర్గాదేవిని పురవీధుల గుండా రథంలో ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటాలు ఆకట్టుకున్నాయి.



ఆస్పరిలో కన్యకాపరమేశ్వరీ మాత ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు




ఆస్పరిలో జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు, హొళగుందలో ఊరేగుతున్న రాజవంశస్తులు



నిట్రవట్టిలో కోలాటం ఆడుతున్న గ్రామస్తులు



అమ్మవారికి పూజలు చేస్తున్న ప్రజలు



పల్లకీలో సతీసమేతంగా ఊరేగుతున్న శ్రీరంగనాథుడు



తుగ్గలిలో నిమజ్జనానికి తరలుతున్న అమ్మవారు



పత్తికొండలో అమ్మవారు, వేంకటేశ్వరస్వామిని ఊరేగిస్తున్న ఆర్యవైశ్యనాయకులు



వెల్దుర్తిలో వాసవీ మాతను ఊరేగిస్తున్న దృశ్యం

నేటి నుంచి 'పల్లె పండుగ'

తుగ్గలి: మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం నుంచి పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విశ్వమోహన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండుగ పేరుతో పంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తుంద న్నారు. ఈనెల 20వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆలూరు: ప్రభుత్వం నేటి నుంచి పల్లె పండుగ వారోత్సవాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తుందని ఎంపీడీఓ జి.రమాదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం 7రోజుల పాటు కొనసాగుతుందన్నారు. సీసీ రోడ్లు,గోశాల, మేకలు, గొర్రెలు, కోళ్ల షెడ్లు 4 రకాల పనులను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆస్పరి: మండలంలోని గ్రామాల్లో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు 21 గ్రామ పంచాయతీలలో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించున్నుట్లు ఎంపీడీఓ గీతావాణి ఆదివారం తెలిపారు. ఈనెల 14న ములుగుందం, డి.కోటకొండ, బనవనూరు, 15న బిణిగేరి, జొహరాపురం, ఆస్పరి, 16న కారుమంచి, కైరుప్పల, అట్టికల్లు, 17న తంగరడోణ, తురువగల్లు, యాటకల్లు, 18న ముత్తుకూరు, పుటకలమర్రి, బిల్లేకల్లు, 19న నగరూరు, చిగళి, హలిగేర, 20న చిరుమాన్‌దొడ్డి, శంకరబండ, చిన్నహోతూరు గ్రామాల్లో నిర్వహించునున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఉపాధి నిధులతో సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు, గోకులం షెడ్లు పనులకు శంకుస్థాపన చేసే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

హాలహర్వి: మండలంలో సోమవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వరలక్ష్మి తెలిపారు. సోమవారం బిలేహాల్, విరుపాపురం, 15న అర్దగేరి, మెదేహాల్, 16న కామినహాల్, చింతకుంట, 17న హాలహర్వి, నిట్రవట్టి, గూళ్యం, 18న బేవినహాల్, 19న కొక్కరచేడు, మల్లికార్జునపల్లి, 20న సిద్ధాపురం పంచాయతీల్లో వారోత్సవాలు జరుగుతాయని చెప్పారు.



గురువులతో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

దేవనకొండ: 2008–2009 బ్యాచ్‌కు చెందిన పి.కోటకొండ జెడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక పాఠశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు నాటి తమ గురువులు హెచ్‌ఎం సాయిబాబా, ఉపాధ్యాయులు టి.వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, శ్రీనివాసులు, సుజాత, గిడ్డమ్మ, విజయ్‌చంద్రను ఘనంగా సన్మానించారు. 15 ఏళ్ల తరువాత కలుసుకోవడంతో అప్పటి మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి, పేద విద్యార్థుల సంక్షేమానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

బన్ని ఉత్సవాలు ప్రశాంతం

- 19 మందికి గాయాలు
- గత ఏడాది కంటే తగ్గిన గాయాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస నాయక్

ఆలూరు రూరల్: దేవరగట్టు బన్ని ఉత్సవాలు ప్రశాంతంగా జరిగాయని, ఆదివారం తెల్లవారు జామున నిర్వహించిన జైత్రయాత్రలో 19 మందికి గాయాలైనట్లు ఆలూరు సీఐ శ్రీనివాస నాయక్ తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ బిందూ మాధవ్ ఆదేశాల మేరకు పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య పర్యవేక్షణలో బన్ని ఉత్సవాలకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు. నెల రోజుల నుంచి అన్ని గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించి రింగు కర్రలు స్వాధీనం చేసుకున్నామన్నారు. అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించనట్లు చెప్పారు. నాటు సారా బట్టీల్లోని బెల్లం ఊట ధ్వంసం చేశామన్నారు. గట్టులో 5 డ్రోన్ కెమెరాలు, బాడీ ఓన్ కెమెరాలు, 50 సీసీ కెమెరాలు, 600 ఎల్ ఈడీ బల్బులు ఏర్పాటు చేశామన్నారు. దీంతో గట్టులో ఈ సారి కర్రలు, అగ్గి దివిటీలు తగ్గాయని చెప్పారు. ఉత్సవాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాలు పార్కింగ్ చేయించామన్నారు. ఉత్సవాలకు 2 లక్షల మందికి పైగా తరలివచ్చారన్నారు. 19 మంది గాయపడ్డారని, ఇందులో నలుగురికి కాలిన గాయాలయ్యాయన్నారు. మరికొందరికి చిన్న చిన్న గాయాలు తగినట్లు చెప్పారు. ప్రస్తుతం గాయపడ్డవారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని.. వీరికి ప్రాణాపాయం లేదని వెల్లడించారు. ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఆలూరు ఎస్ఐ నరసింహులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు గ్రహణం



చిప్పగిరిలో రూఫ్ స్థాయిలో నిలిచిన ఇళ్ల నిర్మాణాలు



నంచర్లలో బేస్‌మెంట్ లెవల్‌లో నిలిచిన ఇళ్ల నిర్మాణాలు

- ఎన్నికల కోడ్‌తో నిలిచిన బిల్లులు, నిర్మాణాలు
- అందుబాటులో లేని ఇసుక
- పెరిగిన నిర్మాణ సామగ్రి ధరలు
- జోరుగా వ్యవసాయ పనులు
- మార్చిలోపు పూర్తి చేసుకోవాలంటున్న కూటమి ప్రభుత్వం
- నిర్మాణ వ్యయం పెంచాలంటున్న లబ్ధిదారులు

చిప్పగిరి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మండలంలో పేదల కోసం నవరత్నాలు– పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా చేపట్టిన గృహ నిర్మాణాలు కూటమి ప్రభుత్వంలో ముందుకు సాగడం లేదు. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 16 గ్రామాల్లో 735 జగనన్న ఇళ్లను గత ప్రభుత్వం అర్హులైన పేదలకు మంజూరు చేసి 220 వరకు ఇళ్లు నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టింది. దీంతో లబ్ధిదారులు ఇళ్లల్లో చేరి నివాసం ఉంటున్నారు. ఎన్నికల కోడ్ రావడంతో బిల్లుల చెల్లింపులు ఒక్కసారిగా నిలిచిపోయాయి. అలాగే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. అలాగే ఇసుక అందుబాటులో లేకపోవడం, నిర్మాణ సామగ్రి ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో నిర్మాణ వ్యయం ఒక్కసారిగా పెరిగిపోయింది. దీంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులను ఆపేశారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు జోరుగా సాగుతుండటం, ఇసుక లేకపోవడంతో కట్టడాలు చేపట్టలేమంటున్నారు. ఇందుకు ప్రభుత్వ నిర్లక్ష్యం తోడవడంతో నిర్మాణాలు మూడడగులు ముందుకు ఆరడుగులు వెనక్కి అన్నచందంగా మారింది. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గృహనిర్మాణ శాఖ అధికారులు ప్రతి వారం లే అవుట్‌లను పరిశీలించి చేసి లబ్ధిదారులకు కలిగిస్తున్నప్పటికీ సరైన ఫలితాలు రావడం లేదు. గత ప్రభుత్వంలో పూర్తయిన ఇళ్లు తప్ప కూటమి ప్రభుత్వంలో ఒక్క ఇల్లు కూడా పూర్తి కాలేదని పేర్కొంటున్నారు. మండలంలో ఆయా గ్రామాల్లో గృహ నిర్మాణాలు బీఎల్ 129, లింటల్ లెవల్ 83, ఆర్‌ఎల్ 22, ఆర్‌సీ లెవెల్‌లో 19, ఇలా వివిధ దశల్లో నిర్మాణాలు కొనసాగుతున్నాయని ఏఈ భవ్య తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కూటమి ప్రభుత్వం చెబుతుంది. అప్పటి వరకు పూర్తయిన వాటికే బిల్లులు ఇస్తామని, నిలిచిపోయిన వాటిని చెల్లించలేమని స్పష్టం చేసింది. దీంతో నిర్మాణాలు వేగవంతం చేసుకోవాలని ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. అయినప్పటికీ ఇసుక అందుబాటులో లేకపోవడం, నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవడం, వ్యవసాయ పనులు జోరుగా సాగుతుండటంతో పనులు చేపట్టడానికి లబ్ధిదారులు సుముఖంగా లేరు. నిర్మాణాలు నిలిచిపోవడంతో ప్రభుత్వం లక్ష్యం నెరవేరడం లేదు.